## కథ

# గ్లోబల్ మిషన్-2020

**ఎ. రాజాహుస్సేన్**

అమెరికా సెనెట్ అత్యవసరంగా సమావేశమైంది. కాన్ఫిడెన్షియల్ అని కబురుపంపాడు సెనెట్ కార్యదర్శి. సెనెటర్లంతా ఎంతో ఉత్సుకతతో ఉన్నారు. ఉన్నపళంగా సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేసినట్లు? తలలు బద్దలు కొట్టుకుంటున్నారు సెనెటర్లు. కొంతమంది గెస్సింగులు మొదలుపెట్టారు. ఇరాన్‌పైకి యుద్ధాన్ని ప్రకటించబోతున్నారా? బిన్‌లాడెన్ ఆచూకీ ఏమైనా తెలిసిందా? అణ్వాస్త్రాల పేరుతో మన శత్రుదేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించబోతున్నారా? ఎంత ఆలోచించినా అసలు విషయం ఎవరికీ అంతుబట్టడం లేదు. సెనెటర్లంతా సభకు వచ్చారని వర్తమానం అందేసరికి అధ్యక్షుడు బుష్ సభలోకి వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. అధ్యక్షులు బుష్ ఇప్పుడొక ప్రకటన చేస్తారని, అనంతరం దీనిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాల్సి వుందని స్పీకర్ అనౌన్స్ చేశాడు. సభలో నిశ్శబ్దం. ఒకటే ఉత్కంఠ.

బుష్‌లేచి నిలబడి మైకందుకున్నాడు. డియర్ సెనెటర్స్... ఈరోజు అత్యవసరంగా మిమ్మల్నందర్నీ ఇక్కడ సమావేశపరచడానికి ఒక ముఖ్య కారణముంది. మీకందరికీ తెలుసు అమెరికా ప్రపంచ గుత్తాధిపత్యాన్ని సాధించే రోజుఇంకెంతో దూరం లేదు. అమెరికన్లను వ్యతిరేకించే ఆఫ్ఘన్లను, తాలిబాన్లను అణిచేశాం. సద్దాం, లాడెన్లను తొక్కేశాం. ఇరాక్‌ను వచ్చే వందేళ్ళదాకా కోలుకోకుండా చేశాం. మన అమెరికన్ బుర్రనుపయోగించి అఖండ సోవియట్ రష్యాను ముక్కలు ముక్కలు చేశాం. భవిష్యత్తులో ఇండియా మనకు పోటీకాకుండా పాకిస్తాన్‌ను రెచ్చగొట్టి మతకల్లోలాలు రేపుతున్నాం- ఆయిల్ సామ్రాజ్యాన్ని గుప్పెట్లో పెట్టుకోవడానికి ఇరాన్‌ను కూడా తొందర్లోనే దెబ్బ తీయబోతున్నాం- ఇక మిగిలిన ఇస్లామిక్ దేశాల్ని ఆర్థిక ఆంక్షల పేరుతో బ్లాక్‌మెయిల్ చేసి అణిచేస్తాం- ఈ వివరాలన్నీ మీకు తెలియనివి కావు అయినా మరోసారి మీదృష్టికి తేవాలని చెబుతున్నాను అంటుండగా డెమొక్రటిక్ పార్టీ సభా నాయకులు లేచి పాయింటాఫ్ ఆర్డర్ లేవదీశాడు. అదేమిటో చెప్పమన్నాడు స్పీకర్.

అధ్యక్షా! అత్యవసర సమావేశమని మమ్మల్నందరినీ పిలిచి అధ్యక్షుడు పాత విషయాల్ని నెమరేస్తున్నాడు. దీనికోసమేనా మమ్మల్ని పిలిచింది? అధ్యక్షుడు ఉద్దేశపూర్వకంగా మా విలువైన సమయాన్ని వృధా చేస్తున్నారనిపిస్తోందని ఆరోపించాడు. దానికి బుష్ అసహనంగా మిస్టర్ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడికి ఓపికలేనట్లుంది. నేనింతవరకు చెప్పింది ఉపోద్ఘాతమే. ఇప్పుడు అసలు విషయం చెప్పబోతున్నాను. దయచేసి వారిని ఓపిగ్గా వినమని తమ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

మైడియర్ సెనెటర్స్!

ఇప్పుడు నేను చెప్పబోయే విషయం మీకు కొత్తగా ఉండొచ్చు. వింతగానూ ఉండొచ్చు. విన్న తర్వాత ఉలిక్కిపడకుండా సావధానంగా ఆలోచించి మీ నిర్ణయాన్ని తెలియజేయండి.

మీకందరికీ తెలుసు పరోక్షంగా ప్రపంచదేశాలపై పెత్తనం చేయడానికి ఇప్పటికే డబ్ల్యుటీవో (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్)ను మనం ఫ్లోట్ చేయించాం. దీని దుష్ప్రభావాలు ఇప్పటికే చాలా దేశాలపై కనిపిస్తున్నాయి. ఏ దేశం కూడా డబ్ల్యుటీవో ద్వారా సానుకూల ఫలితాలు సాధించకుండా ఎగుమతి నిబంధనల్ని మనకనుకూలంగా మలిచాము. వచ్చే దశాబ్దానికి దీనివల్ల పేద దేశాలు మరింత పేదరికంలో కూరుకుపోతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు డబ్ల్యుటీవో ఆటంకంగా తయారై అభివృద్ధి నిలిచిపోతుంది. డబ్ల్యుటీవో ఏర్పాటుతో అమెరికన్లు కోరుకున్నదీ, ఆశించింది ఇదే. కానీ ఇంతటితోనే మనం ఉపేక్షించకూడదు. అమెరికన్‌విజన్ 2020 ప్రకారం ఈ ప్రపంచమంతా గ్లోబల్ విలేజ్‌గా మారిపోతుంది. అప్పటికి ప్రపంచ దేశాలన్నీ తమ సభ్యత, నాగరికత, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల ఆనవాళ్లను కోల్పోతాయి. ఎక్కడ చూసినా అమెరికన్ల సంస్కృతి విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తుంది.

అప్పుడు ఏ దేశస్తులైనా సరే అమెరికన్ల బుద్ధితో ఆలోచించాల్సిందే. అమెరికన్ల కళ్లతోనే నాగరికతను చూడాలి. అంతెందుకు తినే తిండి, వేసుకున్న బట్టలు చివరకు కలలు కూడా మనం చెప్పినట్టే కనాలి. ఇదీ మన అంతిమ లక్ష్యం. అమెరికన్ల ఆశయం- గ్లోబల్ విలేజ్‌పై అమెరికన్ పతాకం ఒక్కటే రెపరెప లాడాలి... అంటూ బుష్ ఉద్విగ్నంగా ప్రసంగిస్తుండగా కరతాళధ్వనులతో సెనెట్ సభ మార్మోగిపోయింది.



థ్యాంక్యూ...థ్యాంక్యూ నా హృదయాన్ని అర్థం చేసుకున్నందుకు మీకందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా... అంటూ బుష్ తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.


మైడియర్ సెనెటర్స్ మన పతాకం రెపరెపలాడాలంటే, మన ఆలోచనలు ఫలించాలంటే, మన కలలు సాకారం కావాలంటే మన ప్రయత్నం ఇంతటితోనే నిలిచిపోకూడదు. ఈ విషయమై వారం రోజులుగా బుర్రలు బద్దలు కొట్టుకొని నేనో ప్రతిపాదనను సిద్ధం చేశా... అని బుష్ అంటుండగానే చాలామంది సెనెటర్లు టెన్షన్‌తో కుర్చీల్లోంచి లేచినిలబడ్డారు.

ఆర్డర్... ఆర్డర్ అంటూ స్పీకర్ సభను ఆర్డర్‌లో పెట్టడానికి ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. దీంతో సభా నాయకుడు బుష్ కల్పించుకొని మైడియర్ సెనెటర్స్ మీరంతా సావధానంగా మీమీ సీట్లలో కూర్చోండి. నా ప్రతిపాదనను మీ ముందుంచుతాను అనేసరికి సెనెటర్లంతా కుర్చీల్లో కూర్చున్నారు.

డియర్ సెనెటర్స్... అమెరికన్ విజన్ 2020 నాటికి సంపూర్ణంగా ఏర్పడే గ్లోబల్ విలేజ్‌ను శాసించటానికి మనకో నాయకుడు కావాలి. వాడు అమెరికన్ బుద్ధితో మాత్రమే ఆలోచించాలి. అయితే గ్లోబల్ విలేజ్‌లో అన్ని దేశాలుంటాయి కాబట్టి వాటి లక్షణాలన్నీ మన నాయకుడిలో వుండాలి. అప్పుడే మన నాయకుడు గ్లోబల్ విలేజ్‌పై సర్వాధికారాన్ని సంప్రాప్తించుకోగలుగుతాడు అని బుష్ చెబుతుండగానే ప్రతిపక్ష నాయకులు లేచి 'భావి గ్లోబల్ నాయకుడు మా పార్టీ వాడే కావాల'ని బిగ్గరగా అరిచాడు. దానికి డెమొక్రట్లంతా అవును. అవునంటూ నినాదాలు చేశారు. దీంతో రిపబ్లికన్లు రెచ్చిపోయి కాదు మా పార్టీవాడే నాయకుడు కావాలి...కావాలి అంటూ ప్రతి నినాదాలు చేశారు. సభను ఆర్డర్‌లో పెట్టడానికి స్పీకర్‌కు తలకుమించినంత పనైంది. మొత్తంమీద సభ ఆర్డర్‌లోకి రాగానే బుష్ తిరిగి తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

"సెనెటర్లంతా సావధానంగా ఉండాలి. మనలో మనకు ఇటువంటి భేదాభిప్రాయాలొస్తాయని నేను ముందుగానే ఊహించాను. అందుకే పార్టీలకతీతంగా మన అమెరికన్ల బుర్రను, బుద్ధిని క్లోనింగ్ చేయించి భావి నాయకుడిలో ప్రవేశపెట్టాలి. అంతేకాదు గ్లోబల్ నాయకుడిలో సద్దాం క్రౌర్యం, పట్టుదలను, బిన్‌లాడెన్ పోరాటపటిమను, ముషారఫ్ నియంతృత్వాన్ని, జపాన్ టెక్నాలజీని, చైనా శ్రమతత్వాన్ని, రష్యా రాజనీతిని అలాగే ఆయా దేశాల అభివృద్ధి నిరోధక లక్షణాల్ని క్లోనింగ్ చేసి మన గ్లోబల్ నాయకుడిలో ఇంజెక్ట్ చేయాలి. గ్లోబల్ నాయకుడిలో

## పరువునష్టం



గోపాలం కోర్టులో పరువునష్టం దావా వేశాడు. ఆరోజు కేసు హియరింగ్‌కి వచ్చింది. వాదోపవాదాలు జరుగుతున్నాయి.

లాయర్: ముద్దాయి నిన్ను అనరాని మాటలు అని అవమానించాడని కేసు వేశావు కదా! అవేమిటో చెబుతావా?

గోపాలం: నేను చెప్పలేనండి!

లాయర్: ఎందుకు?

గోపాలం: అవి మర్యాదస్తులు వినదగ్గ మాటలు కావు సార్.

లాయర్: అయితే వెళ్ళి జడ్జిగారి చెవిలో నెమ్మదిగా చెప్పు.

---

అన్ని దేశాలకు ప్రాతినిధ్యం ఉండటం వల్ల అందరూ సంతోషిస్తారు. గ్లోబల్ నాయకుడు అమెరికన్ల బుద్ధితోనే ఆలోచిస్తాడు కాబట్టి మన ప్రయోజనాలకు ఏమాత్రం భంగంఉండదు" అని బుష్ తన ప్రతిపాదనను తెలియజేశాడు. దానికందరూ బాగుంది... బాగుందీ... అంటూనే...కానీ...అంటూ కూనిరాగం తీశారు.సభ్యులకున్న అనుమానాల్ని తర్వాత తెలియజేయవచ్చు. నా ప్రతిపాదన ఇంకా పూర్తి కాలేదంటూ బుష్ తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

మైడియర్ సెనెటర్స్...గ్లోబల్ నాయకుడ్ని తయారుచేయడం ఎంత కష్టమో మీకు తెలుసు. అణ్వస్త్రాలకన్నా ప్రమాదకరమైన గ్లోబల్ నాయకుడి అవలక్షణాల్ని బయటకు పొక్కకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అమెరికన్ గ్లోబల్ మిషన్-2020గా పిలువబడే ఈ కార్యక్రమాన్ని అత్యంత రహస్యంగా అమలు జరపాలి. దీనికోసం వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. ప్రపంచాధిపత్యాన్ని సాధించాలన్న మన లక్ష్యం ముందు ఈ ఖర్చు ఏమంత పెద్దది కాదు. ఈ మిషన్‌ను అమలు జరిపే బాధ్యతను ప్రపంచ క్లోనింగ్ నిపుణుడు డేవిడ్ హార్మిసన్‌కు అప్పజెప్పడానికి మీ అనుమతి కోరుతున్నాను అనగానే సెనెటర్లు బల్లలు చరుస్తూ తమ ఆమోదాన్ని తెలియజేశారు. బుష్ థ్యాంక్యూ అంటూ సెనెటర్లకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

ఏడాది తర్వాత...

తిరిగి సెనెట్ అత్యవసరంగా సమావేశమైంది. బుష్ కొత్త ఉత్సాహంతో చేతిలో అమెరికన్ పతాకాన్ని పట్టుకొని సభకు వచ్చాడు. మన ప్రియతమ అధ్యక్షుడు బుష్ ఇప్పుడు అమెరికన్లంతా గర్వించే ఓ ప్రకటన చేస్తారని స్పీకర్ ప్రకటించాడు. టెన్షన్‌తో సెనెటర్ల రోమాలు నిక్కబొడుచుకున్నాయి.బుష్ ఏంచెబుతాడో... గ్లోబల్ మిషన్-2020 పురోగతి ఎలా ఉందో అని అందరూ కళ్లప్పగించి ఉత్సుకతతో చూస్తున్నారు.

బుష్ మైకందుకొని "మైడియర్ సెనెటర్స్.... ఈరోజు చాలా సుదినం. అమెరికన్ గ్లోబల్ మిషన్ 2020 గ్రాం...డ్ స...క్సె...స్" అంటూ బిగ్గరగా అరిచాడు.

సెనెటర్లంతా కరతాళ ధ్వనులు చేస్తూ లేచి నిలబడ్డారు.


హెయిల్ మిస్టర్ బుష్... హెయిల్ అంటూ అభినందన పూర్వకంగా నినాదాలు చేశారు.

చాలా సంతోషం మనం అప్పగించిన పనిని హార్మిసన్ రికార్డు టైమ్‌కు పూర్తి చేశాడు. అందుకు మనందరం హార్మిసన్‌ను సభలోకి పిలిచి అభినందించాలి... అని బుష్ అనగానే హార్మిసన్... హార్మిసన్ అంటూ సెనెటర్లంతా ముక్తకంఠంతో స్వాగతం పలికారు.

సెనెటర్ కాకపోయినా సభలోకి తనను అనుమతించి అపూర్వ గౌరవాన్నిచ్చిన సెనెటర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేశాడు హార్మిసన్.కరచాలనం చేసి గ్లోబల్ మిషన్ ఫలితాల్ని సభకు తెలియజేయమని హార్మిసన్‌ను కోరాడు బుష్.

మైడియర్ రెస్పెక్టబుల్ సెనెటర్స్ అంటూ హార్మిసన్ తన మిషన్ పురోగతిని వివరించడం మొదలు పెట్టాడు.

"మన గౌరవ అధ్యక్షులు బుష్ ఆలోచన మేరకు గ్లోబల్ మిషన్ 2020 లో ఎంతో పురోగతిని సాధించాం. భావి గ్లోబల్ నాయకుడికి ఇప్పుడు ఏడాది నిండింది. వాడ్ని అబ్జర్వేషన్లో పెట్టాం. శారీరక ఎదుగుదల నార్మల్‌గానే ఉన్నా వాడి ఆలోచనా సరళి మాత్రం వింతగా ఉంది. వాడి ముందు ఏ వస్తువును ఉంచినా కూడా ధ్వంసం చేస్తున్నాడు. సాధారణంగా మానవులకుండే హృదయ స్పందన వాడికి మోకాల్లో ఉంది. మెదడు భాగం నుంచి అప్పుడప్పుడూ బాంబుల విస్ఫోటనం, మిసైల్ శబ్దాలు వినిపిస్తున్నాయి. మనుషుల్ని చూస్తే వాడు నిగ్రహం కోల్పోయి రక్కేస్తున్నాడు. పాపభీతి... దయ... జాలి వంటి లక్షణాలేమీ వాడిలో కనిపించడం లేదు. వాడిముందు వివిధ దేశాల కరెన్సీ వేస్తే డాలర్‌ను మాత్రం పట్టుకొని మిగతా కరెన్సీని చించేస్తున్నాడు. అలాగే వివిధ దేశాల జెండాల్ని వాడికి చూపిస్తే అమెరికన్ జెండాకు శాల్యూట్ చేసి ఇతర దేశాల జెండాలపై మూత్రం పోస్తున్నాడు. అమ్మ లాలిపాటలు వినిపిస్తే చెవులు మూసుకుంటున్నాడు. అమెరికన్ పాప్ వినిపిస్తే ఎగిరి గంతులేస్తున్నాడు. లాడెన్, సద్దాం, ముషారఫ్ బొమ్మలు చూపిస్తే ముద్దు పెట్టుకుంటున్నాడు. గాంధీ మహాత్ముడి చిత్రపటాన్ని చూపిస్తే మొఖం తిప్పుకున్నాడు. మిస్సైల్ రూపంలో ఉన్న ఆట వస్తువునిస్తే ఎంచక్కా ఆడుకుంటున్నాడు. చందమామను చూపిస్తే మింగేయబోతున్నాడు. అంగారక గ్రహాన్ని వాటేసుకుంటున్నాడు వాడి సైకాలజీని పూర్తిగా స్టడీ చేశాం. వాడు పెరిగి పెద్దయితే విధ్వంసం, వినాశనం, క్షయం తప్ప మంచీ... మర్యాద ... మానవత్వం... శాంతి... అభివృద్ధి... వంటి గుణాలకు ఆగర్భ శత్రువవుతాడు" అంటూ హార్మిసన్ చెబుతుండగా డెమొక్రటిక్ సెనెటర్ ఒకరు అడ్డు తగిలి "మిస్టర్ హార్మిసన్... వాడిలో పాజిటివ్ థింకింగ్‌కు అవకాశమే లేదా?" అని అడిగాడు.



"మిస్టర్ సెనెటర్ ఇండియాలోని శాంతి కాముకుల ఆలోచనల్ని తెచ్చి ఇంజెక్ట్ చేస్తే ఏమైనా ఫలితం ఉండొచ్చు..." అని హార్మిసన్ అనగానే "నో...నో... వద్దు... వద్దూ..." అంటూ సెనెటర్లంతా అభ్యంతరం చెబుతూ అడ్డుపడ్డారు.వాడ్ని అలాగే పెరగనివ్వండి. వాడికి అన్ని అమెరికన్ బుద్ధులొచ్చాయి.వాడే భావి గ్లోబల్ నాయకుడు.వాడే మన అమెరికాను ప్రపంచ వరుసలో ముందు నిలబెడతాడు. వాడి చేతిలోనే మన అమెరికా సామ్రాజ్యం సురక్షితంగా ఉంటుంది. వాడి కనుసన్నల్లోనే గ్లోబల్ విలేజ్ క్షుభితమై అమెరికన్లకు లాభాల పంటల్ని పండిస్తుంది. హెయిల్ హార్మిసన్... హెయిల్... అంటూ బుష్‌తో పాటు సెనెటర్లంతా ముక్తకంఠంతో హార్మిసన్‌కు జేజేలు పలికారు. •